


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 360 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 30 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :360 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 30 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు




- శ్రీశైలం ప్రాజెక్టులో 71 శాతం వరకు నీటి నిల్వలు ఉన్నాయన్న కాకాణి
- సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్న
- నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన

- మిగతా 2లో

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు



- అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

- మిగతా 2లో



## అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- పీవీ సింధు, గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి వారి అకాడమీలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించామన్న రవీంద్ర
- రాష్ట్రంలో 6 ప్రత్యేక అకాడమీలు ప్రారంభించామని వెల్లడి
- ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌ను క్రీడారంగంలో ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు సభలో పాల్గొన్న మంత్రులు కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. భారతదేశానికే ఆదర్శంగా రాజధాని అమరావతిలో 2,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ 'స్పోర్ట్స్ సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. క్రీడలను క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడానికి పీవీ సింధు, పుల్లెల గోపీచంద్, కిదాంబి శ్రీకాంత్ వంటి ప్రముఖ క్రీడాకారుల అకాడమీలకు ప్రభుత్వం స్థలాలు

- మిగతా 2లో



## గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

### ఏపీ గ్రీన్ కమిటీ చైర్మన్ నాగబాబు

- తమది నాటే సంస్కృతే కానీ, నరికేది కాదని స్పష్టం
- మంగళగిరి అరణ్యారామంలో రావి-వేప మొక్కలు నాటిన నాగబాబు దంపతులు
- హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యమని పిలుపు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న అరణ్యారామం భవన డిజైన్ల పరిశీలన

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు, గత ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని, తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టం చేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్ధాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు.

- మిగతా 2లో

# ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

### సీఎం చంద్రబాబు ప్రకటన





- ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్లతో వైద్య సేవలు
- మందులు, రక్త నమూనాల రవాణాకు డ్రోన్ల వినియోగం
- పీహెచ్‌సీలను జిల్లా ఆసుపత్రులతో అనుసంధానించేలా ప్రణాళిక
- టెక్నాలజీతో ప్రజల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు
- మారుమూల ప్రాంతాల్లోని ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందిస్తామని హామీ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాలకు వైద్య సేవలను వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను వినియోగించుకోనుంది. డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే బృహత్తర ప్రాజెక్టును త్వరలో విస్తృతం చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సాంకేతికత ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తలపెట్టిన డ్రోన్ ప్రాజెక్టును సమీక్షించినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్పందిస్తూ, రహదారి సౌకర్యాలు పరిమితంగా ఉండే గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాయని అన్నారు. డ్రోన్ల ద్వారా రక్త నమూనాలను సేకరించడం, అత్యవసర ఔషధాలను వేగంగా చేరవేయడం వంటివి ఈ ప్రాజెక్టులో కీలకమని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) జిల్లా ఆసుత్రులతో,


- మిగతా 2లో

## ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ




**పెన్ పవర్ డెస్క్:** వైద్య రంగంలో ఏఐ తీసుకొస్తున్న మార్పులు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. వ్యాధులను గుర్తించడం, రోగి బాగోగులు చూడటం, డ్రగ్స్ మోతాదునీ దాని పనితీరునీ పరిశీలించడం,

- మిగతా 2లో



## సజ్జల చేతిలో జగన్ బందీ..

### నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- వైసీపీలో తనకు ఎదురైన అవమానాలపై విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- సజ్జల రామకృష్ణారెడ్డి ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్ అని సంచలన ఆరోపణలు
- పార్టీ ప్లీనరీలో తనపై సజ్జల భౌతికంగా దాడి చేసినా జగన్ మౌనంగా ఉన్నారన్న విజయసాయి
- వైసీపీలో ఇప్పుడు జగన్ నంబర్ 2, సజ్జల నంబర్ 1 అని తీవ్ర విమర్శలు
- ఆత్మగౌరవం చంపుకోలేకనే రాజ్యసభ పదవికి, పార్టీకి రాజీనామా చేశానని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**రాజ్యసభ మాజీ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయి రెడ్డి రాజకీయంగా పెను దుమారం రేపారు. వైసీపీలో ఉన్నప్పుడు తనకు ఎదురైన పరిస్థితులు, అవమానాలను వివరిస్తూ ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై నిప్పులు చెరుగుతూ సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ బహిరంగ లేఖను

- మిగతా 2లో

### ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

## నాణ్యతా లోపాలే కారణం

- ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల ఇంగువ అమ్మకాలపై నిషేధం
- నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని తేల్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ
- నమూనాల్లో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తింపు
- కంపెనీల ముడిసరుకులోనూ నాణ్యత లోపాలు ఉన్నాయని వెల్లడి
- దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు సంస్థలకు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో




## ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

### అధికారులపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం

- దానం రాకముందే లక్కీడ్రా ప్రారంభించిన అధికారులు
- ప్రోటోకాల్ ప్రారంభించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారన్న దానం
- బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

- మిగతా 2లో





## వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

- సూర్యాపేట జిల్లా ఎర్రగడ్డ తండాలో విషాదం
- గొడ్డళ్లతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు
- అడ్డుకునేందుకు యత్నించిన ఎస్సై నవీన్ కుమార్ కి గాయాలు

- మిగతా 2లో

## ఎంఐఎం నుంచి బహిష్కరణ..

### అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించిన మజ్లిస్
- సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నవి డీప్‌ఫేక్ వీడియోలని ఆరోపణ
- తనను, పార్టీని అప్రతిష్టపాలు చేసే కుట్ర అని రహ్మత్ బేగ్ వ్యాఖ్య
- వీడియోలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ముందే ఫిర్యాదు చేశానని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను ఎంఐఎం పార్టీ నుంచి బహిష్కరించడం తెలిసిందే. సోషల్ మీడియాలో ఆయనకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర



- మిగతా 2లో

## హర్మూజ్ సంక్షోభం

### గల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

- ఆరు నెలలుగా కొనసాగుతున్న మధ్యప్రాచ్య సంక్షోభం
- అంతర్జాతీయ షిప్పింగ్‌పై 70 దాడులు, 19 మంది నావికుల మృతి
- ఇంధనం, ఎరువుల సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం
- పరిష్కారానికి కృషి చేయాలని సభ్య దేశాలకు ఐఎంఓ పిలుపు

- మిగతా 2లో






# గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటే ఆలోచనే రాలేదు

- మొదటి పేజి తరువాయి

శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి-వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు. భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.అనంతరం, రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పి.వి. చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా, వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ హిమశైలజ తదితర అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ

- మొదటి పేజి తరువాయి

కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు 6 ప్రత్యేక అకాడమీలను ప్రారంభించామని, ప్రపంచంలో ఏ క్రీడా పోటీలు జరిగినా ఏపీ నుంచి కనీసం ఒక్కరైనా ప్రాతినిధ్యం వహించాలనేది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖలో ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో 5 లక్షల మంది పాల్గొని రికార్డు సృష్టించారని గుర్తు చేస్తూ, రాష్ట్రాన్ని 'హెల్దీ, వెల్దీ అండ్ హ్యాపీ స్టేట్'గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు ఆలోచన అని చెప్పారు.

రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రాన్ని వైజాగ్, అమరావతి, తిరుపతిగా 3 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. క్రీడా పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నెల్లూరు పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల్లో 'స్పోర్ట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామని, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు సీఎస్ఆర్ నిధులతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు క్రీడా సదుపాయాలు మెరుగుపరచనున్నట్లు వివరించారు.

# ఏఐ సాయంతో బ్రెయిన్ సర్జరీ

- మొదటి పేజి తరువాయి

స్కానింగ్ రిపోర్టులను విశ్లేషించడం ఇలా వైద్యరంగంలో ఏఐ వేగంగా విస్తరిస్తోంది. ఇలాంటి వాటి సాయంతో మెదడుకు జరిగిన ఓ శస్త్రచికిత్స విజయవంతమైంది. యూకే కు చెందిన ఆ పేషెంట్ కోలుకొని, ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారు.

యూకేకు చెందిన 48 ఏళ్ల రిస్ హిబ్బర్ట్.. ఒకరోజు నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు హఠాత్తుగా స్పృహకోల్పోయారు. తర్వాత మూర్ఛకు లోనయ్యాడు. అప్పటివరకు అతడికి ఎలాంటి అనారోగ్యమూ లేదు. వైద్యులు మెదడుకు స్కానింగ్ తీయగా.. పిట్యుటరీ గ్రంథి సమీపంలో 11 మి.మీ. పరిమాణంలో కణితి ఉందని గుర్తించారు. అది క్యాన్సర్ కాదని తేలినా.. చూపుపై ప్రభావం పడింది. దానిని తొలగించకపోతే.. కంటిచూపు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని అర్థమైంది.అతను చిన్నదానికే అలసటకు గురయ్యేవాడు.

వైద్యులు అతనికి ఏఐ టెక్నాలజీ సాయంతో శస్త్రచికిత్స నిర్వహించారు. మేలోనే అది జరిగినా.. పేషెంట్ పూర్తిగా కోలుకునేవరకు దాని గురించి బయటపెట్టలేదు. ఎండోస్కోపీ అందించిన లైవ్ సర్జరీ వీడియోను ఏఐ విశ్లేషించడంతో సంక్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించేలా వైద్యులకు వీలుకలిగింది. ఈ వివరాలను వైద్యులు మీడియాకు వెల్లడించడంతో తాజాగా విషయం వెలుగులోకి వచ్చింది.

# ఎంఐఎం నుంచి బహిష్కరణ..

## అవి డీప్‌ఫేక్ వీడియోలన్న ఎమ్మెల్సీ

- మొదటి పేజి తరువాయి

వీడియోలు వైరల్ కావడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే, ఆ వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ కుట్రకు పాల్పడ్డారని రహ్మత్ బేగ్ ఆరోపించారు.

పార్టీ బహిష్కరణకు ముందే తన కుటుంబంతో కలిసి మక్కా వెళ్లిన రహ్మత్ బేగ్, అక్కడి నుంచే ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. హైదరాబాద్‌లోని తన స్నేహితులు ఫోన్ చేసి సోషల్ మీడియాలో కొన్ని అశ్లీల వీడియోలు వైరల్ అవుతున్నట్లు సమాచారం అందించారని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియోలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తనపై కుట్ర పన్నారని ఆయన స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీని, పార్టీ అధినేతలు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల ప్రతిష్ఠను దిగజార్చేందుకే ఈ డీప్ ఫేక్ వీడియోలను సృష్టించారని ఆయన వివరించారు.

ఈ అంశంపై తాను ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంతో పాటు గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని రహ్మత్ బేగ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆగస్టు 28వ తేదీ రాత్రి ఎంఐఎం అధిష్ఠానం ఆయనను తక్షణమే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. శాసనమండలి సభ్యత్వానికి కూడా వెంటనే రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. తాజా పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఇతర రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేడు అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

## ఎవరెస్ట్, లాల్జీ గోధూ ఇంగువపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం..

# నాణ్యతా లోపాలే కారణం

ప్రముఖ మసాలా దినుసుల బ్రాండ్లు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ కంపెనీలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఖీూూ×) గట్టి షాక్ ఇచ్చింది. ఈ రెండు సంస్థలు విక్రయిస్తున్న కాంపౌండెడ్ ఇంగువ (హింగ్ పౌడర్) నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేలడంతో, వాటి అమ్మకాలపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 ప్రకారం ఈ నిషేధ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా వెల్లడించింది.

మార్కెట్‌లో నిరంతర నిఘా, చట్టపరమైన నమూనాల సేకరణ అనంతరం జరిపిన పరీక్షల్లో ఈ రెండు కంపెనీల ఇంగువ ఉత్పత్తులు నాణ్యత తక్కువగా (సబ్-స్టాండర్డ్) ఉన్నాయని, కొన్ని సందర్భాల్లో తప్పుడు బ్రాండింగ్ (మిస్‌బ్రాండెడ్) లేదా కల్తీకి గురైనట్లు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది.

**ఎవరెస్ట్ ఉత్పత్తుల్లో తీవ్ర లోపాలు**

ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ విక్రయిస్తున్న ఇంగువ పొడి, దాని వేరియంట్లలో నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపించాయి. ఒక నమూనాలో ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ నిబంధనల ప్రకారం కనీసం 5 శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 0% ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల్లో తేలింది. అదేవిధంగా, ఎవరెస్ట్ యెల్లో హింగ్ పౌడర్‌లో 3.29%, బ్లాక్ హింగ్ పౌడర్‌లో 4.4 శాతం మాత్రమే ఆల్కహాలిక్ ఎక్స్‌ట్రాక్ట్ ఉన్నట్లు గుర్తించారు. గతంలో కూడా ఈ కంపెనీకి చెందిన చికెన్ మసాలా, గరం మసాలా, ఎగ్ కర్రీ పౌడర్ వంటి ఉత్పత్తుల లేబులింగ్‌లో లోపాలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తుచేసింది.

**లాల్జీ గోధూ ఇంగువలోనూ అదే పరిస్థితి**

లాల్జీ గోధూ కంపెనీకి చెందిన పొడి, గడ్డల రూపంలో ఉన్న ఇంగువ నమూనాలు కూడా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, ఇంగువ తయారీకి ఉపయోగించే ముడిసరుకులోనూ అధికంగా స్టార్చ్ (పిండి పదార్థం) ఉన్నట్లు గుర్తించారు. నిబంధనల ప్రకారం ఇంగువలో స్టార్చ్ ఒక శాతానికి మించి ఉండకూడదు. మార్కెట్‌లో సేకరించిన పలు బ్యాచ్‌ల నమూనాల్లో ఈ ఉల్లంఘనలు విస్తృతంగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

ఈ నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీలు తమ ఇంగువ ఉత్పత్తుల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. తమ ఉత్పత్తుల్లోని లోపాలను సరిదిద్దడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఇకపై కేవలం నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే తయారుచేసి విక్రయించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# సజ్జల చేతిలో జగన్ బందీ..

## నాపై దాడి జరిగినా పట్టించుకోలేదు

- మొదటి పేజి తరువాయి

విడుదల చేశారు. తనపై "నమ్మకద్రోహి" అంటూ వైసీపీలోని ఓ వర్గం దుష్ప్రచారం చేయిస్తున్నందునే ఈ లేఖ రాయాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖలో ఆయన చేసిన ఆరోపణలు, వెల్లడించిన విషయాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

**సజ్జల ఒక నమ్మకద్రోహి, టీడీపీ కోవర్ట్**

"నేనే గనక నమ్మకద్రోహిని అయితే, ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని సీబీఐ, ఈడీ చార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. జగన్‌గారికి నమ్మకస్తుడిననే ఒకే ఒక్క కారణంతో ప్రతి చార్జిషీట్‌లో నన్ను ఏ-2గా చేర్చారు. జగన్‌గారు 16 నెలలు జైల్లో ఉంటే, నేను 15 నెలలు జైల్లో ఉన్నాను. నమ్మకద్రోహం నా రక్తంలో ఉంటే అప్పుడే అప్రూవర్‌గా మారేవాడిని" అని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత కూడా తనకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో ఏ-5గా, కాకినాడ సీపోర్టు కేసులో ఏ-2గా తనను చేర్చారని, కానీ ఈ రెండున్నర ఏళ్ల టీడీపీ పాలనలో "సకల శాఖల మంత్రి" అయిన సజ్జల పేరు ఒక్క చార్జిషీట్‌లో కూడా లేకపోవడం గమనార్హమన్నారు. జగన్‌కు వెన్నుపోటు పొడుస్తూ, టీడీపీతో కలిసి ఎలా పనిచేయాలో, కేసులు లేకుండా ఎలా చూసుకోవాలో ఆ "కోటరీ నాయకుడికి" తెలిసినంత తనకు తెలియదని ఎద్దేవా చేశారు.

**ప్లీనరీలో భౌతిక దాడి.. జగన్ ప్రేక్షకపాత్ర**

2022లో మంగళగిరిలో జరిగిన పార్టీ ప్లీనరీలో సజ్జల రామకృష్ణారెడ్డి తనపై నేరుగా భౌతికంగా దాడి చేశారని, ఈ విషయం జగన్‌కు తెలిసినా ప్రేక్షకపాత్ర వహించారని విజయసాయి రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. పార్టీలో ఉన్న ఇతర నాయకులు కూడా ఈ ఘటనను చూశారని తెలిపారు. అప్పటికే సజ్జల చేతిలో జగన్ బందీ అయిపోయారని, అందుకే తనను పూర్తిగా పక్కనపెట్టేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో "సాయన్నకు వయసైపోయింది, ముసలోడైపోయాడు" అంటూ అనుబంధ సంఘాల బాధ్యతల నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఉత్తరాంధ్ర, గుంటూరు నుంచి తిరుపతి వరకు ఉన్న జిల్లాల ఇంఛార్జ్ బాధ్యతల నుంచి, చివరకు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని వివరించారు. ఇలాంటివి మొత్తం 74 అవమానాలు జరిగాయని, ఎన్నో విషయాలు కడుపులోనే దాచుకున్నానని అన్నారు.

**సకల శాఖల మంత్రిగా సజ్జల.. జగన్‌కు గోడ కట్టారు**

"2019లో పార్టీ ఘనవిజయం సాధించిన తర్వాత సజ్జల ప్రమేయం శృతిమించింది. పరిపాలన జగన్‌గారు చేశారా లేక సజ్జల 'సకల శాఖల మంత్రి'గా, రాజ్యాంగేతర శక్తిగా తన ముఠాతో చేశారా? ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు సైతం అపాయింట్‌మెంట్లు ఇవ్వకుండా జగన్‌ను కలవనీయకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయి రెడ్డి తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. పెద్దిరెడ్డి, బొత్స, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరినీ రీజినల్ కోఆర్డినేటర్లుగా పెట్టి, అందరూ చీఫ్ కోఆర్డినేటర్ సజ్జలకు రిపోర్ట్ చేయాలన్న ఆదేశాలు తనకు ఆమోదయోగ్యం కాలేదన్నారు. అందుకే తన ఆత్మగౌరవాన్ని చంపుకుని పనిచేయలేక, నాలుగేళ్ల రాజ్యసభ పదవీకాలాన్ని ముందే వదులుకుని పార్టీకి కూడా రాజీనామా చేశానని స్పష్టం చేశారు.

**వైసీపీలో నంబర్ 2 జగన్.. నాది కోవర్ట్ రాజకీయం కాదు**

"ఇప్పుడు వైసీపీలో నంబర్ 2 ఎవరంటే జగన్‌గారు. నంబర్ 1 ఎవరంటే 'సకల శాఖల మంత్రి' సజ్జల" అని విజయసాయి రెడ్డి వ్యాఖ్యానించారు. ఆ కొత్త నంబర్ వన్‌కు నమస్కారాలు, సాష్టాంగాలు పెడుతూ తాను సర్దుకుపోలేనని, అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. తాను జగన్‌కు ఎన్నడూ ద్రోహం చేయలేదని, చేయబోనని స్పష్టం చేశారు.

పార్టీని కబ్జా చేసి, జగన్‌ను మోసం చేస్తూ కోవర్ట్ రాజకీయం చేయడం తనకు చేతకాదని, తాను ప్రజాస్వామ్యబద్ధంగా నేరుగా గెలిచేందుకే యుద్ధం చేస్తానని, అందుకే కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించారు. పార్టీలో ఎవరు కోవర్టుగా పనిచేస్తున్నారో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. మరో సందర్భంలో మీడియా ద్వారా మరిన్ని నిజాలు తెలియజేస్తానని తన లేఖను ముగించారు.

# శ్రీశైలం ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వినియోగించుకోవడం లేదు

శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానిని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టులో దాదాపు 71 శాతం వరకు నీటి నిల్వలు అందుబాటులో ఉన్నప్పటికీ... సోమశిల, కండలేరు జలాశయాలకు నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన నిలదీశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెంటనే నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో సమాధానం చెప్పాలని... రాయలసీమ, నెల్లూరు జిల్లా రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఉద్దేశమా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోయే పరిస్థితి దాపురించినా ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక ఉన్న దురుద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి నీటిని ఎడాపెడా తరలించుకుపోతుంటే, ఏపీ ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని కాకాణి మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల కోసం చంద్రబాబు ఏపీ రైతుల జీవితాలను తాకట్టు పెడుతున్నారా అని ప్రశ్నించారు. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్లే మొదటి పంటకే సాగునీరు అందక నెల్లూరు జిల్లా రైతాంగం ఆందోళన బాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

## ఏజెన్సీలో డ్రోన్లతో వైద్య సేవలు..

- మొదటి పేజి తరువాయి

ఇతర వైద్య విభాగాలతో అనుసంధానించడం సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఉన్న ఈ విధానాన్ని మరింత వ్యవస్థీకృతం చేసి, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి పౌరుడికీ నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.టెక్నాలజీ సహాయంతో ఆరోగ్య సేవలను మరింత వేగవంతం చేసి, ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలను బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ ద్వారా ఈ వివరాలను పంచుకున్నారు.

# వేపచెట్టు రేపిన చిచ్చు.. ఇద్దరి దారుణ హత్య

సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఈ దాడిలో గొడ్డలి వేట్లకు గురైన ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో... ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లక్కీ డ్రాలో ప్రోటోకాల్ రగడ..

ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ/గృహలక్ష్మి ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ధ్వజమెత్తారు. తాను రాకముందే అధికారులు లక్కీ డ్రా ప్రారంభించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.బంజారాహిల్స్‌లోని కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఖైరతాబాద్ లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీ డ్రా కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్వయంగా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. అయితే ఆయన రాకముందే అధికారులు ప్రక్రియను ప్రారంభించడంతో తీవ్ర అసంతృప్తికి గురైన దానం నాగేందర్ అధికారులపై మండిపడ్డారు.

ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా, ప్రోటోకాల్ పాటించకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని దానం నిలదీశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నిరసనగా కార్యక్రమం మధ్యలోనే అలిగి వెనుదిరిగారు. కాగా, హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## హర్మ్యూజ్ సంక్షోభంగల్ఫ్‌లో చిక్కుకున్న 400 నౌకలు, 6000 మంది సిబ్బంది

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. హర్మ్యూజ్ జలసంధిలో ఏర్పడిన సంక్షోభం కారణంగా గత ఆరు నెలలుగా సుమారు 400 నౌకలు, వాటిలోని దాదాపు 6,000 మంది సిబ్బంది చిక్కుకుపోయారని అంతర్జాతీయ సముద్రయాన సంస్థ (ఐఎంఓ) శు క్రవారం వెల్లడించింది.

ఈ సంక్షోభం ఇంకా సమసిపోలేదని ఐఎంఓ సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగ్యూజ్ తెలిపారు. కొన్ని నౌకలు, సిబ్బంది ఆ ప్రాంతం నుంచి బయటపడగలిగినప్పటికీ, వేలాది మంది నావికులు ఇప్పటికీ తీవ్ర ముప్పును, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంతరాయం కారణంగా ఇంధనం, ఎరువులు వంటి నిత్యావసర వస్తువుల ప్రపంచ సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఫిబ్రవరి 28న ఈ వివాదం ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ నౌకాయానంపై కనీసం 70 దాడులు జరిగినట్లు ఐఎంఓ ధృవీకరించింది. ఈ దాడుల్లో 19 మంది నావికులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ జలసంధుల గుండా రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదని జూలైలో ఐఎంఓ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ జలమార్గంలో నౌకాయానాన్ని పునరుద్ధరించడానికి సభ్య దేశాలన్నీ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చింది.

ఈ సమస్యకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనేందుకు సభ్య దేశాలు, షిప్పింగ్ పరిశ్రమ కలిసి పనిచేయాలని డొమింగ్యూజ్ కోరారు. మరోవైపు, నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి ప్రాంతాల్లో కూడా సముద్ర భద్రత క్షీణిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడులతో మొదలైన ఈ వివాదంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నౌకాయానం, ఇరాన్ అణు కార్యక్రమం, అంతర్జాతీయ ఆంక్షల వంటి అంశాలపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## రామవరం యానాదుల కాలనీలో గంజాయి ఆరోపణలపై వివాదం




**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29**: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం యానాదుల కాలనీ వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మర్రి చంద్రశేఖర్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని ఆ కాలనీవాసులు శనివారం జగ్గంపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 28వ తేదీ రాత్రి గంజాయి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేస్తున్న సమయంలో చుట్టుపక్కల వారు ప్రశ్నించినట్లు సమాచారం. గంజాయి కారణంగా కాలనీలోని పిల్లలు, యువత చెడిపోతున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గంజాయి విక్రయాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనను ఎదిరించే వ్యక్తుల ఇళ్లలో గంజాయి పెట్టి వారిపై కేసులు పెట్టిస్తున్నాడని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కాలనీవాసుల డిమాండ్ చేశారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. చర్యలు తీసుకోకపోతే కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించి తమ గోడును వినిపిస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.




## ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి
# వైద్య సేవలే ధ్యేయం

### ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలి
### కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 29 :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.కాకినాడ కలెక్టరేట్ హాలులో శనివారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, స్థానిక శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొని ఆసుపత్రి అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, వైద్య సేవల మెరుగుదలపై సమీక్షించారు. తొలుత గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై అధికారులు చేపట్టిన చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆసుపత్రికి అవసరమైన నిధులు, ఆధునిక వైద్య పరికరాలు మంజూరు చేయించేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని సూచించారు. సెక్యూరిటీ సిబ్బందికి ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించేలా సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెడికల్ విద్యార్థుల పీజీ హాస్టళ్లలో వసతులను మెరుగుపరచాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య పరికరాల లభ్యత, సిబ్బంది కొరత, భద్రత, పారిశుధ్యం, సీఆర్ఆర్ సివిల్ పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.రెడ్‌క్రాస్ నిధులతో చేపట్టిన క్యాన్సర్ బ్లాక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, పాత క్రిటికల్ కేర్ బ్లాక్‌ను తక్షణమే ఆధునీకరించాలని సూచించారు.రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం ఆసుపత్రి తూర్పు వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణంలో మురుగునీరు నిల్వ ఉండకుండా మూడు అవుట్‌లెట్ల ద్వారా బయటకు తరలించేలా చర్యలు చేపట్టి దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నాలుగు జనరల్ వేస్ట్ డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఆసుపత్రి కిచెన్‌ను అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఓపీ సేవలను బలోపేతం చేయడం ద్వారా జీజీహెచ్‌పై రోగుల భారాన్ని తగ్గించవచ్చన్నారు. 24 గంటలూ ల్యాబ్, ఫార్మసీ, ఐసీయూ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు విశ్రాంత గుండె వ్యాధుల నిపుణులైన కార్డియాలజిస్టుల సేవలను వినియోగించుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆసుపత్రి స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రహరీ గోడ నిర్మించాలని, పల్మనాలజీ బ్లాక్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సివిల్ పనులను సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. అధునాతన వైద్య పరికరాలను దశలవారీగా సమకూరుస్తున్నామని, త్వరలోనే పూర్తి స్థాయి క్యాన్సర్ కేర్ బ్లాక్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం. శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ,ఇతర ప్రజాప్రతినిధులు,వివిధ విభాగాల వైద్యాధికారులు,జిల్లా యువజన సంఘ కార్యదర్శి గేదెల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రీసర్వే పేరుతో లంచం డిమాండ్.. రూ.16,500 తీసుకుంటూ వీఆర్వో ఏసీబీకి చిక్కిన వైనం

### రెవెన్యూ వ్యవస్థలో అవినీతికి అడ్డుకట్ట ఎప్పుడు? ఉన్నతాధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు






**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 29**
ప్రభుత్వ భూముల సర్వే, రీసర్వే, భూ హక్కుల నమోదు వంటి కీలకమైన బాధ్యతలు నిర్వర్తించాల్సిన రెవెన్యూ సిబ్బంది లంచాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ పంచాయతీలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న చొల్లంగి నాగేశ్వరరావు రూ.16,500 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన రెవెన్యూ శాఖలో కలకలం రేపింది.ర్యాలి గ్రామ శివారు చిన్నంవారిపాలెంకు చెందిన చిన్నం చండికేశవ రెడ్డి భూమికి సంబంధించి ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో సమస్య తలెత్తినట్లు సమాచారం.
తనకు సంబంధించిన భూమిలో అదనంగా నమోదైన భూమిని తన పేరున రాయాలని వీఆర్వోను కోరినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. అయితే ఆ భూమి మార్కెట్ విలువ రూ.40 వేలుగా ఉందని, అందులో 50 శాతం ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేసినట్లు ఆయన ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.
తొలుత రూ.20,000 డిమాండ్ చేసి, చివరకు రూ.16,500కు ఒప్పుకున్నట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు శనివారం సాయంత్రం ర్యాలి పంచాయతీ కార్యాలయంలో నగదు అందజేస్తుండగా రాజమండ్రి ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎస్. భవ్య కిషోర్ ఆధ్వర్యంలో అధికారులు వీఆర్వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.

**ప్రజలకు సేవ చేయాల్సిన చోట.. లంచాల డిమాండ్లా?**

రీసర్వే ప్రక్రియలో సాధారణ ప్రజలు తమ భూమి వివరాలు సరిచేసుకోవడానికి రెవెన్యూ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. భూమి విషయంలో చిన్న పొరపాటు జరిగినా రైతులు, భూయజమానులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి సమయంలో తమ అధికారాన్ని ఉపయోగించి డబ్బులు డిమాండ్ చేస్తే సామాన్య ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.వీఆర్వో స్థాయిలోనే లంచం డిమాండ్ జరిగిందని ఏసీబీ కేసు వెలుగులోకి రావడం వెనుక రెవెన్యూ వ్యవస్థపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎంతమేరకు ఉందనే అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి**

ఒక ఉద్యోగి ఏసీబీకి పట్టుబడిన ఘటనను కేవలం ఒక వ్యక్తి అవినీతి చర్యగా ముగించకుండా, సంబంధిత కార్యాలయంలో గతంలో జరిగిన భూ సర్వేలు, రీసర్వేలు, భూ రికార్డుల మార్పులు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా భూముల విషయంలో ప్రజల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారా? ఇతర సిబ్బంది ప్రమేయం ఉందా? అనే అంశాలపై కూడా విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు.

**అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: ఏసీబీ**

ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు సేవలందించాల్సిందే తప్ప, లంచాలు డిమాండ్ చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదని ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎస్. భవ్య కిషోర్ తెలిపారు. కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, మన్యం జిల్లాల పరిధిలో అవినీతి ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామని, లంచం డిమాండ్ చేసే అధికారుల సమాచారం ఏసీబీకి అందించాలని ఆమె సూచించారు.
వీఆర్వో నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు.ఇకనైనా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి, కేవలం కేసు నమోదుతో సరిపెట్టకుండా సంబంధిత కార్యాలయంలో భూ రికార్డుల నిర్వహణ, రీసర్వే ప్రక్రియ, గతంలో వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లంచం ఇవ్వక తప్పదనే భయాన్ని సామాన్య ప్రజల్లో నుంచి తొలగించి, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సుదీర్ఘ గైర్హాజరుతో ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

- విధులకు హాజరుకాకపోవడంతో డీఈవో చర్యలు
- ఉత్తర్వులు అందజేసే అవకాశం లేక పత్రికాముఖంగా సమాచారం

**పిఠాపురం, పెన్ పవర్ ఆగస్టు 29 :** సుదీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న పాఠశాల సహాయకుడు (హిందీ) మహేశ్వర్ల వీరబ్రహ్మంను సస్పెండ్ చేస్తూ కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు విరవ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కె. జనార్ధనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
ప్రత్తిపాడు మండలం పోతులూరు ఎంపీయూపీ పాఠశాల నుంచి రిలీవ్ అయిన వీరబ్రహ్మం 2025 జూన్ 15న పిఠాపురం మండలం విరవ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో చేరారని పేర్కొన్నారు. అయితే రిలీవర్ లేకపోవడంతో అదే రోజు తిరిగి పోతులూరు ఎంపీయూపీ పాఠశాలలో చేరినట్లు తెలిపారు.
2025 జూలై 1 నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు వివిధ కారణాలతో వైద్య సెలవులు పెట్టి విధులకు హాజరుకాలేదని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. 2026 మే 1 నుంచి ఎలాంటి సెలవు దరఖాస్తులు సమర్పించకుండా విధులకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. ఆయనకు సంబంధించిన ఫోన్ నంబర్లు కూడా పనిచేయకపోవడంతో సంప్రదించేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు.
ఈ విషయాన్ని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లగా, సుదీర్ఘ గైర్హాజరును పరిగణనలోకి తీసుకుని వీరబ్రహ్మంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జనార్ధనరావు వెల్లడించారు. సస్పెన్షన్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయుడికి నేరుగా అందజేసే పరిస్థితి లేకపోవడంతో పత్రికాముఖంగా తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# ఘనంగా నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం వేడుకలు



**పెద్దాపురం.. పెన్ పవర్... ఆగష్టు. 29.** పెద్దాపురం మండలం: తెలుగు భాష దినోత్సవ సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ ) పెద్దాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో మహారాణి కాలేజీలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ముందుగా తెలుగు భాష పితామహులు గిడుగు వెంకట రామమూర్తి పంతులు యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు, అనంతరం మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ నేటి తెలుగు భాష ప్రాధాన్యత నశించిపోతుందని ఆంగ్ల భాషకు ప్రాధాన్యతిస్తున్నారని, తెలుగు మాట్లాడడం కూడా మరిచిపోయే రోజులు వస్తాయని గిడుగు రామమూర్తి యొక్క ఆనాడు కృషి నేటి వరకు తెలుగు భాష ప్రాధాన్యత దేశమంతటా తెలుసు అని తెలియజేశారు, ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా అధ్యక్షుడు సత్యం పగడాల మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు భాషను సామాన్య ప్రజలకు చేరువ చేయడానికి, వ్యవహారిక భాషను ప్రోత్సహించడానికి చేసిన కృషి చిరస్మరణీయమని, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే భాషలో విద్య అందించాలనే ఆలోచనను ఆయన బలంగా ముందుకు తీసుకెళ్లారని తెలిపారు.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో మాతృభాషకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గిడుగు రామమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు, ఈ కార్యక్రమానికి కళాశాల ఉపాధ్యాయులు, వెంకటేశ్వరరావు, ఏసుబాబు, శ్రీనివాసు, జ్యోతిబా తెలుగు భాష దినోత్సవం వివరించారు

ఈ కార్యక్రమంలో, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు, సురేష్, మణికంఠ, రాజు,సంతోష్, సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## జగ్గంపేటలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చెన్నారావు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు. ఈ సంధార్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ వాడుక భాష ఉద్యమానికి ఆద్యులు, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామ్మూర్తి గారు జయంతి సంధార్భంగా నేడు తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు ఆయన ఎనలేని కృషి చేశారని తెలియజేశారు. విధ్యార్ధులకు వ్యాసరచన పోటీ, చిత్రలేఖనం, పద్య పఠనం మరియు క్విజ్ పోటీలను నిర్వహించారు. తెలుగు ఆధ్యాపకురాలు డాక్టర్ డి.సత్యలత పాల్గొన్నారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భాష్యంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం






**సామర్లకోట.. పెన్ పవర్... ఆగష్టు. 29.**వ్యవహారిక భాషను గ్రంథస్థమైనటువంటి భాషగా మార్చడానికి, గ్రాంథిక భాష నుంచి వ్యవహారిక భాషకు రావడానికి మన అక్షరాన్ని సురక్షం చేయడానికి ఎంతో కృషి చేసిన, అక్షరాన్ని సుస్థిరం చేసిన మన పిడుగు గిడుగు రామ్మూర్తి పంతులు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారము భాష్యం స్కూల్లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ కవుల వేషధారణలో అలరించారు. ముఖ్యంగా తెలుగు భాష వైభవాన్ని గ్రంథాలు యొక్క గొప్పతనాన్ని తెలియజేయడం కోసం ఎన్నో గ్రంథాలను సేకరించి ప్రదర్శించారు. తెలుగు తల్లికి గౌరవ వందనంగా ఒక చిన్నారి మా తెలుగు తల్లికి అనే పాటకు నృత్యం చేసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్య, జడ్. సి.ఓ శిరీష, ఛాంప్స్ ప్రిన్సిపాల్ జ్యోతి దేవి, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇంచార్జ్ గోవిందరాజు విద్యార్థులకు తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



**సామర్లకోట. పెన్ పవర్.. ఆగష్టు. 29..**సామర్లకోట యార్లగడ్డ అక్కరాజు మున్సిపల్ హైస్కూలు నందు తెలుగు భాషాదినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయిని కె. శ్రీదేవి అద్యక్షతన భాషోపాధ్యాయులు బి. శ్రీలక్ష్మి మరియు వి.ఎన్. దేవి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు తెలుగు భాష పట్ల మమకారాన్ని, ఆసక్తిని పెంచేవిధంగా వ్యాసరచన, వక్తృత్వం మరియు పద్యపఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన తెలుగు తల్లి వేషధారణ అందరినీ ఆకట్టుకుంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల లో విద్యార్థులు ఎంతో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినికి ఉపాధ్యాయులు బి. జయ శేషసాయి, కె. అరుణ, ఎ.ఎల్.వి కుమారి, ఎ.శ్రీవల్లి,యు.నాగమణి డి.సూర్యనారాయణ తదితర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు మండలంలో నేడు విద్యుత్ అంతరాయం



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఆగస్టు, 29:**132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనుల కారణంగా ప్రత్తిపాడు మండల పరిధిలోని పలు గ్రామాలకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ బోర్లకు మాత్రం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు,తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ మార్పును గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని వీరభద్రరావు కోరారు.







**పెద్దాపురం.. పెన్ పవర్.. ఆగష్టు. 29.**శ్రీ అర్క పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనం, మాధుర్యం, సాహితీ వైభవాన్ని విద్యార్థులకు తెలియజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు గిడుగు వెంకట రామమూర్తి గొప్పతనం ,తెలుగు భాషపై పద్యాలు, పాటలు, ఉపన్యాసాలు, చార్ట్ ప్రజెంటేషన్లు నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు “జోష్నా అచ్చుత”, హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయినులు “లక్ష్మీ స్రవంతి, స్వర్ణ”, ప్రైమరీ ఉపాధ్యాయినులు “రత్న, అనుదీపిక” మాట్లాడుతూ తెలుగు భాష మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రతి ఒక్కరూ తెలుగు భాషను ప్రేమించి, గౌరవించి, భావితరాలకు అందించాలని తెలిపారు.

విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

## రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులు

**కరప, పెన్ పవర్, ఆగస్టు 29:** రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తోందని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు అన్నారు. కరప మండలం ఉప్పలంక గ్రామంలో శనివారం ఇంటింటికి టీడీపీ విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆయా పథకాల ద్వారా పేదలు, మహిళలు, రైతులు, యువత, బలహీన వర్గాలకు అందుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రభుత్వం సాధించిన ప్రగతిని తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి గాడిలో పెట్టడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడం, మౌలిక వసతులను మెరుగుపరచడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు పేదల సంక్షేమాన్ని సమతూకంగా ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, బుంగా సింహాద్రి, టీడీపీ కాకినాడ పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవు వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దూరి స్వామి, గండి వెంకటేశ్వరరావు, బొమ్మిడి తాతారావు, మల్లాడి భవాని రాంబాబు, సంగాని బాల మహేశ్వరరావు, షేర్ నూకరాజు, పంతాడి చిన్ననూకరాజు, రేకాడి వీరబాబు, పంతాడి దుర్గారావు, గేదెల సత్తిబాబు, సంగాని సోమరాజు, చాట్ర ఇమ్మానియేలు, చీపురుపల్లి జయేంద్రబాబు, వాసంశెట్టి ఉమా, పలివెల జానకిరామయ్య, గంజా రాంబాబు, కాళ్ల శ్రీను, ఎలగా లోవరాజు, నర్సింగరావు, కోనాల కృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వర్క్‌షాప్

**భవిష్యత్ సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన**






**గండేపల్లి, పెన్ పవర్ ,ఆగస్టు 29:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. బ్రెయినో విజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ వారి సహకారంతో ఈ నెల 27 నుంచి 29 వరకు ‘ఇంటెలిజెంట్ డేటా ఆటోమేషన్ కోసం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు’ అనే అంశంపై కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతులైన ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులు నూతన సాంకేతికతలను అధ్యయనం చేసి, వాటిని ఆచరణలో ఉపయోగించుకునేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

బ్రెయినో విజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ.. సాధారణ కంప్యూటర్లతో పోలిస్తే క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా, సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని వివరించారు. భవిష్యత్తులో బ్యాంకింగ్, భద్రత, వాతావరణ మార్పుల అంచనా, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని తెలిపారు.

అలాగే ఏజెంటిక్ కృత్రిమ మేధస్సు ద్వారా మనిషి ఆలోచనా విధానాన్ని అనుసరిస్తూ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని, నిర్దేశించిన పనులను స్వయంచాలకంగా నిర్వహించే తెలివైన కృత్రిమ మేధస్సు వ్యవస్థల గురించి వివరించారు. పరిశ్రమల్లో డేటా స్వయంచలనం, వినియోగదారుల సేవలు తదితర రంగాల్లో ఏజెంటిక్ కృత్రిమ మేధస్సు విస్తృతంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి ఎం.వి. రాజేష్ మాట్లాడుతూ.. ఇటువంటి ఆధునిక సాంకేతిక అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించేందుకు అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. వర్క్‌షాప్‌కు హాజరైన వనరుల వ్యక్తులను అభినందించారు. కార్యక్రమానికి అధ్యాపక సమన్వయకర్తగా శ్రీజాను నాయక్ వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎం.వి. హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, డైరెక్టర్–అకడమిక్స్ డాక్టర్ కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, కార్యక్రమ సమన్వయకర్తలు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు

## క్షయవ్యాధి నివారణపై ర్యాలీలు.. విద్యార్థులకు సురక్షిత సాంకేతిక వినియోగంపై అవగాహన




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 29:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన కొండపల్లి, ఆనూరు, పెద్దాపురం ప్రాంతాల్లో క్షయవ్యాధి అవగాహన, నివారణ ర్యాలీలతో పాటు విద్యార్థులకు సురక్షిత సాంకేతిక వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

కొండపల్లి గ్రామంలో నిర్వహించిన క్షయవ్యాధి అవగాహన, నివారణ ర్యాలీలో విద్యార్థులు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు పాల్గొని ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. 'క్షయవ్యాధి రహిత సమాజం కోసం అందరం కలిసి పనిచేద్దాం' వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. క్షయవ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి తగిన వైద్యం పొందడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని తెలిపారు.

రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు పూర్తిస్థాయిలో చికిత్స తీసుకోవాలని ప్రజలకు వివరించారు.

పెద్దాపురంలోని ఎన్టీఆర్ కాలనీలో ఆదిత్య విశ్వవిద్యాలయం ఫోరెన్సిక్ శాస్త్ర విభాగం, కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ బృందం సంయుక్తంగా క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించింది. విశ్వవిద్యాలయ విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు ప్రజలకు క్షయవ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు.


ఆనూరు గ్రామంలో ఆదిత్య విశ్వవిద్యాలయం ఔషధశాస్త్ర కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ జి.వి. పవన్ ఆధ్వర్యంలో ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి పట్ల అపోహలను తొలగించి, ముందస్తు పరీక్షలు, వైద్య చికిత్స ప్రాధాన్యాన్ని వివరించారు.

**విద్యార్థులకు సాంకేతిక అవగాహన**

కొండపల్లి గ్రామంలోని పాఠశాలలో 'స్మార్ట్ అభ్యాసం -- సురక్షిత సాంకేతికత -- ఉజ్వల భవిష్యత్తు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాభ్యాసానికి సమర్థవంతంగా వినియోగించుకోవడం, డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవడం, అంతర్జాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడం, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం వంటి అంశాలను వివరించారు.

మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, అంతర్జాలాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ధృవీకరణ సంకేతాలు వంటి సమాచారాన్ని అందించకూడదని, అనుమానాస్పద సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో ఆదిత్య విశ్వవిద్యాలయ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, విద్యార్థి కార్యకలాపాల డీన్ డాక్టర్ డి. కిషోర్, విస్తరణ కార్యకలాపాల సమన్వయకర్త డాక్టర్ ఐ.వి. వీరాంజనేయులు, జాతీయ సేవా పథకం అధికారులు జె. విద్య, బి.కె. విద్యాసాగర్, డాక్టర్ జి.వి. పవన్, అధ్యాపకులు, స్వచ్ఛంద సేవకులు, పాఠశాల విద్యార్థులు, కొండపల్లి, ఆనూరు, పెద్దాపురం ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.




# ప్రజాదర్బార్ తో ప్రజాసమస్యల పరిష్కారం



ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29 :** ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. జగ్గంపేట రావులమ్మ నగర్ లోని క్యాంప్ ఆఫీసులో శనివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు పెన్షన్లు, హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామానికి చెందిన నక్క బాలకృష్ణ కుమార్తె నక్క పూర్ణ అనుదీప్తికి గుండెకు రంధ్రం కావడంతో ఓపెన్ హార్ట్ సర్జరీకి ఎల్ఓసి 3,92,000 అందించేందుకు, గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన మండపాక రాజులమ్మకు బ్రెయిన్ ట్యూమర్ రావడంతో 3,72,000 ఎల్ ఓ సి అందించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పంపించడం జరిగింది. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, పాఠం శెట్టి కొండరాజులు, జనసేన నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగలూరి రామ్ దీపు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఏపీఎస్ఎస్ డీసీ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా ఎనలిస్ట్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో కేవలం 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని ఆయన వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కోర్సుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ జి. శ్రీనివాస్ 8688977277 నంబర్ ను సంప్రదించాలని ఆయన సూచించారు. సీట్ల సంఖ్య పరిమితంగా ఉన్నందున అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు కోరారు.

# కాకినాడ జిల్లాలో దిశా కమిటీ సమీక్ష






**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 29:** కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమీక్ష సమావేశం ప్రారంభమైంది. కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.సమావేశానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, దిశా కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. గత దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును కూడా పరిశీలించారు.ఐసీడీఎస్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి,వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు.

సమావేశంలో ఐసీడీఎస్,డీఆర్డీఏ, డ్వామా,వ్యవసాయం, ఉద్యానవనం, ఏపీఎంఐపీ,పశుసంవర్ధక,విద్య, వైద్య ఆరోగ్యం,బ్యాంకింగ్,పోర్టు, పంచాయతీరాజ్,పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి,నెడ్‌క్యాప్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు.

# మాతృభాషను మరవొద్దు.. తెలుగును బతికించుకుందాం!

గిడుగు ఆశయాలను కొనసాగించాలి.. తెలుగు భాషా దినోత్సవంలో శ్రీనికేతన్ పాఠశాల నిర్వాహకుల పిలుపు



**పిఠాపురం రూరల్, పెన్ పవర్, ఆగస్టు 29:** ఆంగ్ల భాషా వ్యామోహంలో మాతృభాష తెలుగు క్రమంగా తన ప్రాధాన్యతను కోల్పోతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్ తరాలు తెలుగు మాట్లాడటానికే దూరమయ్యే ప్రమాదం ఉందని శ్రీనికేతన్ పాఠశాల కరస్పాండెంట్ వెంకట రామ్మోహనరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషను సామాన్య ప్రజలకు చేరువ చేసి, వ్యవహారిక భాషకు పట్టం కట్టిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

పిఠాపురం రూరల్‌లోని శ్రీనికేతన్ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకట రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ.. గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషను ప్రజల నిత్య వ్యవహారంలోకి తీసుకురావడానికి, సామాన్యులకు సులభంగా అర్థమయ్యే వ్యవహారిక భాషను ప్రోత్సహించడానికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు క్లిష్టమైన భాషలో కాకుండా సులభంగా అర్థమయ్యే మాతృభాషలో విద్య అందించాలనే ఆలోచనను ఆయన బలంగా ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో మాతృభాషకు మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో చదవడం, రాయడం, మాట్లాడటం వంటి భాషా నైపుణ్యాలను పెంపొందించేలా ప్రభుత్వం, విద్యాసంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

"తెలుగు మన మాతృభాష.. దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని పేర్కొంటూ గిడుగు రామమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని వెంకట రామ్మోహనరావు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, బోధనా సిబ్బంది పాల్గొని తెలుగు భాషపై తమ అభిమానం చాటుకున్నారు.

# జగ్గంపేట భాష్యం స్కూల్లో ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలు




**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 29:** జగ్గంపేటలో రావులమ్మ తల్లి గుడి వద్ద గుంటూరు వారిచే నడపబడుచున్న భాష్యం స్కూల్ లో శనివారం తెలుగు భాష దినోత్సవ వేడుకలు మరియు జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ లో చదువుతున్న అన్ని తరగతుల విద్యార్థులు ఈ భాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆహుతులను అలరించారు. మొదటగా గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పద్యాల పోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన విద్యార్థులకు వివిధ బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. మరియు ఇటీవల స్కూల్ నందు నిర్వహించిన వివిధ రకాల క్రీడా విభాగాల్లో విజేతలైన విద్యార్థులందరికీ కూడా పతకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాషను తప్పక మాట్లాడుతూ ఇతర భాషలను కూడా నేర్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, మాతృభాషను మరవద్దని మరియు విద్యార్థుల జీవితంలో క్రీడలు ముఖ్యమని క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకొని క్రీడా స్ఫూర్తిని చాటాలని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్చార్జ్ గోవిందరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ ప్రైమరీ ప్రిన్సిపాల్ కె వాణి, తెలుగు అధ్యాపకులు బాలాజీ రావు, అధ్యాపకురాలు రేవతి, నాగజ్యోతి, నూకరత్నం మరియు వ్యాయామ ఉపాధ్యాయులు మల్లయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు హేమగంగ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

చిన్న కథల పోటీల్లో విద్యార్థుల సృజనాత్మక ప్రతిభ



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 29:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్యం, సృజనాత్మకతపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ సందర్భంగా చిన్న కథల పోటీలు నిర్వహించారు.

పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. వివిధ అంశాలపై ఆసక్తికరమైన కథలను రచించి, తెలుగు భాషపై తమకున్న అభిమానం, సాహిత్య అభిరుచిని ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి, విద్యార్థి కార్యకలాపాల డీన్ డాక్టర్ డి. కిషోర్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, మాతృభాషపై మమకారాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా తెలుగు భాష, సాహిత్యానికి సంబంధించిన మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రధాన గ్రంథాలయ అధికారి కె. అశోక్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, సుజాత, వెంకటరమణ, భూదేవి, స్వామి, రామచంద్రారెడ్డి, రమ్య, వి. లక్ష్మి రమ్యతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మందేశ్వర శనీశ్వర స్వామి ఆలయానికి రూ.2.28 లక్షల ఆదాయం





**కొత్తపేట,పెన్ పవర్, ఆగస్టు 29:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ మందేశ్వర శనీశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి నిర్వహించిన వివిధ సేవలు, పూజల ద్వారా ఆలయానికి మొత్తం రూ.2,28,484 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.ముఖమండపం తైలాభిషేకం ద్వారా రూ.12,600, ఏకాదశ రుద్ర తైలాభిషేకం ద్వారా రూ.33,000, మహాన్యాస పూర్వక తైలాభిషేకం ద్వారా రూ.39,550, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.15,840, తిలదానం ద్వారా రూ.550, స్వయం హోమం ద్వారా రూ.800, కేశఖండన ద్వారా రూ.40 చొప్పున ఆదాయం లభించింది. ప్రత్యక్ష పూజల ద్వారా మొత్తం రూ.1,02,380 ఆదాయం సమకూరింది.

అదేవిధంగా పరోక్ష (ఆన్‌లైన్) పూజల ద్వారా రూ.1,08,900, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.17,204 ఆదాయం లభించింది. దీంతో శనివారం ఆలయానికి వచ్చిన మొత్తం ఆదాయం రూ.2,28,484గా నమోదైంది. మందపల్లి శ్రీ మందేశ్వర శనీశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.ు

## ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు



**కరప, పెన్ పవర్, ఆగస్టు 29 :**
కరప మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామమూర్తి పంతులు, భారత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 పత్తి సత్యనారాయణ, హెచ్‌ఎం ఎన్.రాజరాజేశ్వరి మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలు, క్రీడారంగంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ సాధించిన విజయాలు చిరస్మరణీయమని కొనియాడారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు వెలుగుబంట్ల గోపాలకృష్ణ అందించిన రూ. 10 వేల విలువైన క్రీడా దుస్తులను క్రీడాకారులకు పంపిణీ చేశారు.

ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఏఎంసీ ఛైర్మన్ ఎం.రమేష్, దేవు వేంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జి.దుర్గాభవాని, పీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌పై బురదజల్లే రాజకీయాలు సాగనివ్వంద

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తే జనసేన చూస్తూ ఊరుకోదు
- కొత్తపల్లి మండలం జనసేన పార్టీ ఇంచార్జ్ రావు అక్షయ్

**పెన్ పవర్ ప్రతినిధి (పిఠాపురం) ఆగస్టు 29** నాగులపల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంపై కొత్తపల్లి మండలం జనసేన పార్టీ ఇంచార్జ్ రావు అక్షయ్ ఘాటుగా స్పందించారు.

రావు అక్షయ్ మాట్లాడుతూ.. "సీనియర్ రాజకీయ నాయకుడైన నారాయణరెడ్డి కి రాజకీయ అనుభవం ఉంది. వాస్తవాలు ఏమిటో తెలుసుకునే సామర్థ్యం కూడా ఉంది. నిన్న స్వయంగా నాకు ఫోన్ చేసి విషయాలు అడిగారు. కానీ ఈరోజు అదే విషయాన్ని రాజకీయంగా వక్రీకరించి పవన్ కళ్యాణ్ పై బురదజల్లే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు.

పిఠాపురం నియోజకవర్గానికి పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధిని కళ్లుండి చూడలేని వారు మాత్రమే విమర్శలు చేస్తారని అన్నారు. కొత్తపల్లి మండలంలో జరుగుతున్న అభివృద్ధి, గ్రామాల్లో వేస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల పనులు కనిపించడం లేదా? లేక కనిపించినా రాజకీయ స్వార్థం కోసం కనిపించనట్టుగా నటిస్తున్నారా? అని ప్రశ్నించారు."ప్రజలకు ఏదో అన్యాయం జరుగుతోందని ఒక అపోహను సృష్టించి, దానిని రాజకీయ ఆయుధంగా మార్చుకోవాలనే ప్రయత్నాలు ఇక సాగవు. గ్రామ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లండి, పరిష్కారం కోసం పోరాడండి. అంతే తప్ప అభివృద్ధిని రాజకీయ రంగు పులిమి పవన్ కళ్యాణ్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు కూడా గమనిస్తున్నారు" అని అక్షయ్ అన్నారు.

పవన్ కళ్యాణ్ రాజకీయ గ్రాఫ్‌ను అందుకోవడం సంగతి పక్కన పెడితే, ఆయన ప్రజల్లో సంపాదించుకున్న విశ్వాసానికి దగ్గరగా రావడం కూడా ప్రత్యర్థులకు సాధ్యం కాదని అన్నారు."మీకు వ్యక్తిగతంగా ఏమైనా సమస్యలు ఉంటే వ్యక్తిగతంగా చూసుకోండి. కానీ పవన్ కళ్యాణ్ పై రాజకీయంగా బురదజల్లుదాం, ప్రజల్లో అపోహలు సృష్టిద్దాం అంటే మాత్రం జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసే బాధ్యత మాపై ఉంది. అభివృద్ధి చేసే నాయకుడిని విమర్శించడం కాదు.. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలను ప్రజల ముందు ఎండగడతాం" అని రావు అక్షయ్ హెచ్చరించారు.పవన్ కళ్యాణ్ విధానం రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు కాదని, "ప్రజలకు మంచి చేయాలి.. పిఠాపురం నియోజకవర్గ రూపురేఖలు మార్చాలి.. ప్రతి గ్రామానికి అభివృద్ధి అందాలి" అనే సంకల్పంతో ఆయన పనిచేస్తున్నారని అక్షయ్ తెలిపారు.

నాగులపల్లి గ్రామ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న వారిని తాము శత్రువులుగా చూడబోమని, సమస్య పరిష్కారం కోసం నిర్మాణాత్మకంగా ముందుకు వస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జనసేన సిద్ధంగా ఉందని అన్నారు. అయితే అభివృద్ధి పేరుతో రాజకీయ దుష్ప్రచారం చేస్తే మాత్రం ప్రజలే తగిన సమాధానం చెబుతారని రావు అక్షయ్ స్పష్టం చేశారు.

# హార్బర్ ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి






- రూ.72.42 కోట్ల నిధులు మంజూరై మూడు నెలలైనా పనుల్లో పురోగతి లేదు
- కేంద్ర సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి
- దిశా కమిటీ చైర్మన్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 29 :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా కమిటీ చైర్మన్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచించారు. జిల్లాలో రూ.72.42 కోట్లతో చేపట్టనున్న ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశం ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖలో పోషణ్ వాటిక, వన్ స్టాప్ సెంటర్, మిషన్ వాత్సల్య, బేటీ బచావో--బేటీ పడావో, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, విద్యాశాఖలో పీఎం పోషణ్--డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పీఎం శ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్ష, ఆర్టీఈ కింద ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు తదితర అంశాలపై చర్చించారు.అలాగే వ్యవసాయ శాఖలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ప్రకృతి వ్యవసాయం, మారిటైమ్ బోర్డు పరిధిలో కాకినాడ గేట్‌వే పోర్టు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్, కాకినాడ డీప్ వాటర్ పోర్టు, ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులు, జలజీవన్ మిషన్, పీఎంజీఎస్‌వై రహదారులు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు తదితరాలపై సమీక్ష నిర్వహించారు.

**హార్బర్ పనుల్లో జాప్యంపై ఎంపీ అసంతృప్తి**

ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.72.42 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. నిధులు మంజూరై మూడు నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభం కాకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ఆధునీకరణ పనులు పూర్తయితే కాకినాడ టౌన్, రూరల్ ప్రాంతాల మత్స్యకారుల జీవనోపాధికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.రాష్ట్ర మారిటైమ్ బోర్డు అధికారులు తక్షణమే స్పందించి వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

షిప్ బిల్డింగ్‌లో యువతకు శిక్షణ

కాకినాడ పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో రానున్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని ఎంపీ సూచించారు. షిప్ బిల్డింగ్, కంటైనర్ తయారీ రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలు ఉన్నందున యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

వ్యవసాయ రంగంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.రసాయన ఎరువుల అధిక వినియోగంతో కలిగే అనర్థాలను వివరించి, కేవలం మొక్కుబడి శిక్షణ కాకుండా క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మక శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై కూడా రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచించారు.మార్చిలోగా జలజీవన్ పనులు పూర్తి చేయాలి

జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించే పనులను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని ఎంపీ అధికారులను కోరారు.పైపులైన్ పనుల అనంతరం దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. స్థానిక పోర్టు యాజమాన్యం సహకారంతో ఇండోర్ స్టేడియానికి ఏసీ సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు.పంటల బీమా విషయంలో గోదావరి జిల్లావ్యాప్తంగా ఒకే రకమైన ఏకరూప పంటల బీమా అమలయ్యేలా ప్రత్యేక తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఎంపీ వెల్లడించారు.

**కేంద్ర పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ**

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గత దిశా సమావేశంలో చేసిన సూచనలపై తీసుకున్న చర్యల నివేదికను సమావేశంలో విస్తృతంగా సమీక్షించినట్లు చెప్పారు.హార్టికల్చర్, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, మున్సిపల్ శాఖలతో పాటు పీవీజీ రామ్‌జీ, పీఎంఈజీపీ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పోర్టు అనుసంధాన పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని ఎక్కువ మంది రైతులు సద్వినియోగం చేసుకునేలా జిల్లా కలెక్టర్ తీసుకున్న చర్యలను అభినందించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలు గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రజలకు చేరేలా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాకు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు తీసుకురావడంలో కృషి చేస్తున్న ఎంపీని అభినందించారు.

సమావేశంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో డి. శ్రీలలిత, పరిపాలనాధికారి ఎం. బుజ్జిబాబు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గుడికి వెళ్లొచ్చిన కాసేపటికే.. అనంతలోకాలకు!

**టిప్పర్ లారీని తప్పించబోయి బుల్లెట్ అదుపుతప్పి ప్రమాదం.. యువకుడు దుర్మరణం**





**గండేపల్లి, ఎన్ పవర్ ఆగస్టు 29:** ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన విషాద ఘటన గండేపల్లి మండలం మురారి గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులకు చెప్పి గుడికి వెళ్లిన యువకుడు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కాగిత గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం కాగిత గ్రామానికి చెందిన రబ్బా ప్రసాద్ (22) తన అన్నయ్య నవీన్‌తో కలిసి బుల్లెట్‌పై వాడపల్లి వెంకన్నబాబు ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మురారి గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లోడ్ టిప్పర్ లారీని తప్పించే క్రమంలో బుల్లెట్ హ్యాండిల్ లారీకి తగిలింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది.

అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ ప్రసాద్‌పై నుంచి దూసుకెళ్లడంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి అన్నయ్య నవీన్‌కు చేయి తీవ్రంగా నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడైన నవీన్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రసాద్‌ను కూడా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు గండేపల్లి ఎస్సై వై.వి. శివ నాగబాబు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కన్నీరుమున్నీరుగా కుటుంబ సభ్యులు

"గుడికి వెళ్లొస్తానని చెప్పి.. ఇక తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయావా?" అంటూ ప్రసాద్ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుడి ఆకస్మిక మృతితో కాగిత గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న యువకుడు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి





- నేర సమీక్షలో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాలు
- రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 29 :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్,పోలీసు అధికారులను ఆదేశించారు.ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, పకడ్బందీగా ఆధారాలను సేకరించి నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లాలో నమోదైన వివిధ కేసుల దర్యాప్తు పురోగతిని ఈ సందర్భంగా సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, నిందితుల అరెస్టులు,దొంగతనం కేసుల ఛేదన,మహిళలు,చిన్నారులపై నేరాలు,సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు,అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి,వాటి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. కేసుల్లో లభించే ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి,న్యాయస్థానంలో నేరం రుజువయ్యే విధంగా దర్యాప్తు నాణ్యతను పెంచాలని ఆదేశించారు.శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.రౌడీషీటర్లు,పాత నేరస్తులు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టి,నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, పెద్దాపురం డీఎస్పీ ఎబిజి తిలక్,ఎస్బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణతో పాటు జిల్లాలోని పలువురు సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.


Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# గొల్లపాలెం--కుయ్యేరు రహదారి పనులు తుది దశకు

- మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో మంజూరు
- పనుల పురోగతిపై ఎంఆర్వో ఠాగూర్ పర్యవేక్షణ

**కాజులూరు, పెన్ పవర్ ఆగస్టు 29:** గొల్లపాలెం--కుయ్యేరు రహదారి అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో మంజూరైన ఈ రహదారి పనులను అధికారులు వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం రహదారిపై తారు (బీటీ) పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గొల్లపాలెం--కుయ్యేరు మధ్య రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రహదారి అభివృద్ధికి మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమై ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. రహదారిపై అవసరమైన మేరకు మెటల్ వేసి, బీటీ పనులు చేపడుతున్నారు. పనుల నాణ్యత, పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. మండల రెవెన్యూ అధికారి జి. ఠాగూర్ రహదారి పనులను పర్యవేక్షిస్తూ, పనులు నిర్ణీత ప్రమాణాల మేరకు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గొల్లపాలెం, కుయ్యేరు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి పరిస్థితుల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

మంత్రి చొరవతో రహదారి అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కావస్తుండటంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలి

### కాజులూరు మండల యూటిఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



**కాజులూరు, పెన్ పవర్, ఆగస్టు 29:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాజులూరు మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల యుటిఎఫ్ అధ్యక్షులు వి.భానుప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ గొల్లపాలెం నుంచి ప్రారంభమై కాకినాడ గాటీ సెంటర్, సర్పవరం జంక్షన్ మీదుగా సాగి తిరిగి బాలాజీ చెరువు సెంటర్‌కు చేరుకుంది.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షను తప్పనిసరి చేయడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పరీక్ష నిబంధనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ర్యాలీలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయప్రకాష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సాపే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గణేష్‌తో పాటు కాజులూరు మండల శాఖకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## మానవతా విలువలను పెంపొందించేది మాతృభాషే



**కాకినాడ, ఆగస్టు 29 ,పెన్ పవర్:** మానవతా విలువలను పెంపొందించడంలో మాతృభాష కీలక పాత్ర పోషిస్తుందని పి.ఆర్. డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకురాలు ఇ. శారదాకుమారి అన్నారు. తెలుగు భాషను పరిరక్షించడంతో పాటు భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ వ్యవహారిక భాష కోసం ఉద్యమించి, తెలుగు భాషలో వాడుక భాషకు ప్రాధాన్యం కల్పించిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి అని కొనియాడారు. తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన తెలుగు శాఖాధిపతి టి. తేజేశ్వర రావును అభినందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇ. శారదాకుమారి మాట్లాడుతూ "కలసికట్టుగా తెలుగు భాషను కాపాడుకుందాం" అని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో జన్మించిన గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను వివరించారు. గ్రాంథిక భాషకు బదులుగా ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషను ప్రోత్సహించేందుకు ఆయన చేసిన ఉద్యమం, ఎదుర్కొన్న సవాళ్లు, చివరకు సాధించిన విజయాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలతో పాటు విద్యార్థులు పాటించాల్సిన అంశాలను ఆమె వివరించారు. తెలుగు సాహిత్యంలోని మాధుర్యం, పద్యాల సొగసును వివరించి విద్యార్థుల్లో మాతృభాషపై ఆసక్తిని పెంపొందించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన పద్య పఠనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తెలుగు శాఖ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి. సత్యనారాయణ, అధ్యాపకులు ఇ. సుబ్రహ్మణ్యం, తెలుగు డీన్ టి. తేజేశ్వరరావు, కోకిల లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలు జీవన నైపుణ్యాలను పెంపొందిస్తాయి






**అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు**

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 29 :** క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించి జీవన నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొని ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాల క్రీడా విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. దేశానికి ఖ్యాతి తీసుకొస్తున్న ఉత్తమ క్రీడాకారుల ప్రతిభను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. కళాశాలలో నిర్వహించిన వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ పలు పతకాలు సాధించిన లక్ష్మీ వేద సంహితను డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు ప్రత్యేకంగా సత్కరించారు. ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు.

కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు, అశ్విని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## జిల్లా వైసిపి బిసి సెల్ ఉపాధ్యక్షుడిగా దాడి రాజగోపాల్.




**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 29:** జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం మండల కేంద్రమైన కిర్లంపూడి గ్రామానికి చెందిన దాడి రాజ్ గోపాలకృష్ణ (దాడి రాజా)ను నియమించినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం దాడి రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దాడి రాజా మాట్లాడుతూ వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినందుకు జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోట నరసింహం, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు తోట రాంజీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వైసీపీ జిల్లా బీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన దాడి రాజాను జగపతినగరం మాజీ సర్పంచ్, వైసిపి నాయకులు పెంటకోట నాగబాబు, మండల వైసిపి అధ్యక్షులు పెనగంటి రాజేష్, వైసిపి నాయకులు వేగి రామకృష్ణ, పాముల చంటి, మద్దాల రాంబాబు, దాడి పెదబుజ్జి, యల్లపు నానాజీ, పెంటకోట సాయిబాబు పలువురు వైసిపి నాయకులు అభినందించారు.

## యానాంలో పులసకు పులకింత ధర!

- రూ.24 వేలకు రెండు కిలోల చేప.. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం





**పెన్ పవర్ ప్రతినిధి (యానాం) ఆగస్టు 29:** మాంసాహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే పులస చేపల సీజన్ యానాంలో మొదలైంది. గౌతమి గోదావరిలో ఎర్రనీరు పోటెత్తిన సమయంలో సముద్రం నుంచి ఎదురీదుతూ గోదావరిలోకి వచ్చే పులసలు మత్స్యకారుల వలకు చిక్కుతుంటాయి. దీంతో పులసల కోసం మత్స్యకారులు, వ్యాపారులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.

ఇటీవల కొంతకాలంగా పులసల జాడ కనిపించకపోయినా.. శుక్రవారం యానాం మార్కెట్‌కు సుమారు రెండు కిలోల బరువున్న పులస చేప వచ్చింది. వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఈ చేప చిక్కడంతో మార్కెట్‌లో ఒక్కసారిగా సందడి నెలకొంది. దీనిని పార్వతి అనే వ్యాపారి రూ.24 వేలకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అనంతరం కొంత అదనపు ధరను కలిపి వినియోగదారులకు విక్రయించనున్నట్లు పేర్కొన్నారు.

గోదావరిలో వరద నీరు రావడం ప్రారంభమైన తర్వాత లభించిన తొలి పులస రూ.15 వేలు, రెండో పులస రూ.14 వేల ధర పలికినట్లు మత్స్యకారులు తెలిపారు. తాజాగా లభించిన మూడో పులస ఏకంగా రూ.24 వేల ధర పలకడంతో ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇదే అత్యధిక ధరగా నిలిచిందన్నారు.

పులస రాకతో యానాం మార్కెట్‌లో మత్స్యకారులు, వ్యాపారుల్లో ఉత్సాహం నెలకొంది. గోదావరిలో వరద ప్రవాహం మరింత పెరిగితే పులసల రాక కూడా పెరిగే అవకాశం ఉందని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ముద్రగడ మృతి పట్ల క్రీడాకారులు తీవ్ర సంతాపం.

- ముద్రగడ మృతితో క్రీడా దినోత్సవానికి క్రీడాకారులకు దూరం.





**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 29:** మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత, ముద్రగడ పద్మనాభం మృతి పట్ల క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాకారులు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది మండల కేంద్రంమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యంగ్ మెన్స్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడమే కాకుండా, బాల,బాలికలకు కబడ్డీ,ఖో ఖో వంటి పోటీలు నిర్వహించేవారు. ఈ సంవత్సరం ముద్రగడ మృతి చెందడంతో క్రీడా దినోత్సవానికి దూరం అవ్వడమే కాకుండా, యంగ్ మెన్స్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెంటకోట నాగబాబు మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహించే క్రీడా పోటీలకు ముద్రగడ పూర్తి సహాయ, సహకారాలు అందించే వారన్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా ఈ ఏడాది క్రీడా దినోత్సవానికి దూరంగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ ఎస్ రామకుమార్,పెంటకోట మూర్తి,

పాముల వీరబాబు,గంధం అప్పారావు, మళ్ల నాగు,మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు,గోళ్ళ బాబి, దాడి పెదబుజ్జి, గంధం ప్రభాకర్, నైదాన రఘు, ఏఎన్ఎల్ జగన్ ఎల్లపు నానాజీ,దాడి పెదబుజ్జి, గంధం ప్రభాకర్, నైదాన రఘు,లక్కోజు కోటి ఏఎన్ఎల్ జగన్ పలువురు స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెన్ పవర్

ఆదివారం 30 ఆగస్టు 2026

## ఇతరులతో పోల్చుకోవద్దు.. సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు: సూర్యకుమార్ యాదవ్

- యువ క్రికెటర్లు ఇతరులతో పోల్చుకోవద్దన్న సూర్యకుమార్
- వయసుతో పనిలేదు, సన్నద్ధతే ప్రధానమని స్పష్టీకరణ
- పరుగులు చేస్తూ ఉంటే సెలక్టర్లే వెతుక్కుంటూ వస్తారని భరోసా
- దేశవాళీ క్రికెట్‌లో తాను పడిన కష్టాలను గుర్తు చేసుకున్న స్టార్ బ్యాటర్
- ఎవరూ చూడనప్పుడు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్లకు భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సందేశం ఇచ్చాడు. ఓపిక కోల్పోకుండా పరుగులు చేస్తూ ఉండాలని, తమ సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని సూచించాడు. నిలకడగా రాణిస్తే సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని, మీ బ్యాటే అన్నింటికీ సమాధానం చెబుతుందని భరోసా ఇచ్చాడు. ఎన్నో ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, ఆలస్యంగా భారత జట్టులోకి వచ్చి అగ్రశ్రేణి బ్యాటర్‌గా ఎదిగిన తన అనుభవాన్ని సూర్య యువతతో పంచుకున్నాడు.

ఒక యువ క్రికెటర్ ప్రయాణంలో ఓపిక ఎంత ముఖ్యమో వివరిస్తూ, 'ఐఏఎన్ఎస్'తో సూర్యకుమార్ మాట్లాడాడు. "ప్రతి ఒక్కరి కథ వేరు, ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నం. అందుకే యువ క్రికెటర్లు ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని నేను చెబుతాను. నేను కూడా ఏళ్ల తరబడి ఏజ్-గ్రూప్, దేశవాళీ క్రికెట్ ఆడాను. కిట్ బ్యాగ్‌తో బస్సులు, రైళ్లలో ఎన్నో ప్రయాణాలు చేశాను. నా అవకాశం కోసం ఓపికగా ఎదురుచూశాను" అని తెలిపాడు.

భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్లపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని సూర్యకుమార్ ప్రస్తావించాడు. "మన దేశంలో 21 లేదా 25 ఏళ్లకల్లా జట్టులో చోటు దక్కకపోతే కెరీర్ ముగిసిపోయినట్లేనని, మరో మార్గం చూసుకోవాలని చాలామంది భావిస్తారు. కానీ,

నా దృష్టిలో వయసు అనేది గడువు కాదు, మీ సన్నద్ధతే అసలైన గడువు" అని పేర్కొన్నాడు. ఎవరూ గమనించనప్పుడు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాలని, కఠోర సాధనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని సూచించాడు.

సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రదర్శనలే అత్యంత శక్తిమంతమైన మార్గమని సూర్యకుమార్ అభిప్రాయపడ్డాడు. "క్రికెట్ పరంగా చెప్పాలంటే, మీరు పరుగులు చేస్తూ ఉంటే, మీ బ్యాటే సమాధానం

చెబుతుంది. సెలక్టర్లు కచ్చితంగా మిమ్మల్ని గుర్తిస్తారు. మీరు ఉండాల్సిన సరైన స్థానానికి చేరుకుంటారు" అని భరోసా ఇచ్చాడు. తోటి ఆటగాళ్లతో పోల్చుకుని ఆందోళన చెందే యువతకు సూర్యకుమార్ మాటలు స్ఫూర్తినిస్తున్నాయి. కలకు గడువు తేదీ ఉండదని, నిబద్ధతతో సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని సూర్య తన కెరీర్ ద్వారా నిరూపించాడు.

# గ్రౌండ్‌లోనే కాదు.. బ్రాండ్ మార్కెట్‌లోనూ మన స్టార్లదే హవా: ఫోర్బ్స్ ఇండియా 2026 రిపోర్ట్!






**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదు.. కోట్ల మంది ఆరాధించే ఒక అతిపెద్ద పండుగ.. టీమిండియా స్టార్ ప్లేయర్లు మైదానంలోకి దిగితే రికార్డులు బ్రేక్ అవుతాయి, అదే వాణిజ్య ప్రపంచంలోకి అడుగుపెడితే బిజినెస్ డీల్స్ దుమ్మురేపుతాయి. ప్రపంచంలోనే ఏ క్రీడాకారులకూ లేనంతటి ఫ్యాన్ బేస్, మార్కెట్ పొటెన్షియల్ భారత క్రికెటర్ల సొంతం. తమ ఆటతీరుతో పాటు మైండ్ బ్లాకింగ్ పర్సనాలిటీ, సోషల్ మీడియా ఇంపాక్ట్‌తో స్టేడియం సరిహద్దులు దాటి కార్పొరేట్ రంగాన్ని ఏలుతున్నారు. ఆటకు వీడ్కోలు పలికినా సరే, వీరి బ్రాండ్ వ్యాల్యూ కొద్దిగా కూడా తగ్గకపోవడం వీరికున్న భారీ క్రేజ్‌కు అద్దం పడుతోంది. తాజాగా ప్రముఖ వ్యాపార పత్రిక వెల్లడించిన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 (ఖీశీతీఎవం ×అంఱు రాష్ట్రశీషర్‌శీజూజూవతీం 2026) అత్యంత విలువైన సెలబ్రిటీల జాబితాలో ఇండియన్ క్రికెటర్లు తమ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. సినిమా, సంగీతం, క్రీడలు.. ఇలా దేశంలోని అన్ని రంగాల బిగ్ సెలబ్రిటీలను దాటుకుని కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ (రూ.3,017 కోట్లు), గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా (రూ.2,507 కోట్లు)లను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. టీ20, టెస్టుల నుంచి తప్పుకున్నా కోహ్లీకున్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. బ్రాండ్ విలువ: ఏకంగా రూ.3,542 కోట్లు

**రెండో స్థానంలో కెప్టెన్ కూల్ ధోనీ:**

భారత జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ జాబితాలో రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ సుమారు రూ.2,141 కోట్లు. మహీ భాయ్ క్రికెట్‌కు దూరమైనప్పటికీ ధోనీకి ఉన్న అభిమానగణం, వ్యాపార కార్యకలాపాలు, ప్రకటనల ఒప్పందాలు అతడి బ్రాండ్ విలువను భారీగా నిలబెట్టాయి. మొత్తం భారత సెలబ్రిటీల జాబితాలో ధోనీ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

**దక్షిణాసియాసంస్కృతి తెలుసుకోవడం**

**మూడో స్థానంలో మాస్టర్ సచిన్:**

క్రికెట్ దిగ్గజం మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కూడా ఈ ఫోర్బ్స్ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సచిన్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతుంది. మొత్తం సెలబ్రిటీల లిస్టులో ఆయన 8వ స్థానంలో నిలిచాడు.

**నాలుగో స్థానంలో బుమ్రా:**

ఇక భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత బ్యాండ్ వ్యాల్యూ కలిగిన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లుగా నమోదు అయింది. ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో నిలిచాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

**ఐదో స్థానంలో రోహిత్ శర్మ:**

భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెటర్ల జాబితాలో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,055 కోట్లు అని చెప్పాలి.. మొత్తం సెలబ్రిటీల జాబితాలో రోహిత్ 18వ స్థానంలో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి విజయాలు, అభిమానుల్లో ఉన్న ఆదరణ, వాణిజ్య ఒప్పందాలు బ్రాండ్ విలువను పెంచడంలో కీలకంగా మారాయి.

ఫోర్బ్స్ ఇండియా 2026 టాప్--5 జాబితాలో చోటు దక్కించుకున్న ఈ ఐదుగురు భారత క్రికెటర్ల మొత్తం బ్రాండ్ విలువ కలిపితే ఏకంగా రూ.9,556 కోట్లు కావడం విశేషం. గ్రౌండ్‌లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలతో పాటు మైదానం బయట వారికున్న లీడర్‌షిప్ క్వాలిటీస్, సోషల్ ఇమేజ్ ఇండియన్ ఆటగాళ్లను గ్లోబల్ మార్కెట్‌లో తిరుగులేని బ్రాండ్‌లుగా నిలబెడుతున్నాయి.

## ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు."ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# దీపిక మాటలు కాదు.. చేతల్లో చూపించాలి







తాను ప్రభాస్ కంటే ఎక్కువ సినిమాలు చేశానని.. తన కంటే ఎక్కువ సక్సెస్ ఫుల్ అన్నట్లుగా దీపికా పదుకొనే ఇటీవల ఒక కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపుతున్నాయి. వేరే హీరో అంటే ఏమో కానీ.. దేశవ్యాప్తంగా తిరుగులేని అభిమానాన్ని సంపాదించుకుని ఇండియాలో బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా అవతరించిన ప్రభాస్‌ను.. వివాదాలకు దూరంగా ఉంటూ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే హీరో మీద పరోక్షంగా తన అక్కసు వెళ్లగక్కడం.. తనతో పోటీ పెట్టుకుని మాట్లాడ్డం.. అతణ్ని కించపరిచేలా మాట్లాడ్డం తెలుగు వాళ్లకే కాదు.. ఇతర భాషల వాళ్లకు కూడా నచ్చట్లేదు. ఎప్పుడూ వివాదాలతో సహవాసం చేసే దీపికకు ముందు నుంచే సోషల్ మీడియాలో హేటర్స్ ఎక్కువ. తాజా వ్యాఖ్యలతో ఆమె మీద వ్యతిరేకత మరింత పెరిగిపోతోంది. దీపిక పాస్ట్ ఎఫైర్ల దగ్గర్నుంచి.. వివిధ సందర్భాల్లో ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోల వరకు తీసుకొచ్చి ఆమెను ట్రోల్ చేస్తున్నారు.ఇదంతా పక్కన పెడితే.. ప్రభాస్ కంటే తాను పెద్ద స్టార్ అన్నట్లు చెప్పుకుంటూ తనకు దీటుగా పారితోషకం డిమాండ్ చేస్తున్న దీపికకు నెటిజన్లు ఒక సలహా ఇస్తున్నారు. నిజంగా దీపిక అంత పెద్ద స్టార్, తనకు భారీ మార్కెట్ ఉందని నమ్ముతున్నట్లయితే.. మేల్ సూపర్ స్టార్లతో కలిసి చేసే సినిమాల్ని వారితో పోటీ పెట్టుకునే బదులు ఒక లేడీ ఓరియెంటెడ్ మూవీ చేసి తన బాక్సాఫీస్ స్టామినా ఎంతో రుజువు చేయాలని అంటున్నారు. తనే లీడ్ రోల్ చేసిన సినిమాతో తాను ఎన్ని వందల కోట్లు రాబట్టగలదో చూపిస్తే.. ఆమె ఫాలోయింగ్, మార్కెట్ ఎంత అన్నది అందరికీ అర్థమవుతుంది కదా అని అభిప్రాయపడుతున్నారు. చివరగా దీపిక నటించిన లేడీ ఓరియెంటెడ్ మూవీ 'చప్పక్' అయితే రూ.50 కోట్లకు అటు ఇటుగా వసూళ్లు రాబట్టింది. అది 2020లో రిలీజైన సినిమా. పైగా అదొక ప్రయోగాత్మక చిత్రం. ఇప్పటికి దీపిక మార్కెట్ ఇంకా పెరిగి ఉంటుంది కాబట్టి.. ఇప్పుడు ఒక యాక్షన్ టచ్ ఉన్న లేడీ ఓరియెంటెడ్ సినిమా చేసి దీపిక తన స్టామినా ఏంటో చూపించాలి. ఆ సినిమా ప్రభాస్ చిత్రాల్లాగే వందలు, వేల కోట్ల వసూళ్లు రాబడితే.. అందుకు తగ్గట్లే పారితోషకం కోసం డిమాండ్ చేయొచ్చు. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, సక్సెస్ ఫుల్ అని బల్లగుద్ది చెప్పొచ్చు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com